# అద్దం

అపురూప అద్దంలో మరోసారి తన ప్రతిబింబం చూసుకుంది. దివినుండి భువికి దిగివచ్చిన అప్సరసలా. . . . కవికల్పనలో మెరిసిన కావ్యనాయికలా. . . . వెన్నెట్లో తడిసి, విరిసిన ముద్దమందారంలా . . . అనంతమైన అందం ఆకృతి దాల్చినట్లు. . అపురూప అందమైన పెదాలు అలవోకగా విచ్చుకుని, అద్దాన్ని ఓ క్షణం అద్భుతమైన కాంతితో వెలిగించాయి.

"రూపా! ఫ్లయిట్ టైమ్ అయిపోతోంది!" బయటనుండి ఆమె భర్త.

అపురూప లేచి నిలబడి నిలువెత్తు అద్దంలో తన నిండైన విగ్రహాన్ని మొదట ఎదురుగా, తర్వాత కొద్దిగా ఎడమకి తిరిగి, ఆ తర్వాత కొద్దిగా కుడికి తిరిగి చూసుకుంది.

అయిదడుగుల అయిదంగుళాలెత్తు, ఎత్తుకు తగ్గ లావు, స్వీట్ నథింగ్స్ మాట్లాడు తున్నట్లుండే చెంపకు చారడేసి కళ్ళు, విల్లులా వంపు తిరిగిన కనుబొమలు, వయ్యారంగా వొంగిన కనురెప్పలు, కొనదేలిన ముక్కు, పగడాలు పొదిగినట్లు ఎర్రటి పెదాలు. . . ఓహ్! అందానికి నిర్వచనంలాంటి అందం.

ఆమె కళ్ళు గర్వంతో మిలమిలా మెరిశాయి.

"అమ్మా! త్వరగా తెములు!" ఎదురుగా పదహారేళ్ళ కూతురు వినీల.

ఎవరైనా నమ్ముతారా తనకు పదహారేళ్ళ కూతురుందంటే? కలిసి బయటికెళ్తే 'మీ చెల్లెలా?' అని అడుగుతారు. అప్పుడు తను సమ్మోహనంగా, అహంకారం మిళితమైన నవ్వు నవ్వి, "నా కూతురు" అంటే, 'పరాచికాలాడొద్దు రూపా! నీకింత

పెద్ద కూతురుందంటే నమ్మేస్తామనుకున్నావా! నీ వయసెంతనీ, పాతికలోపే కదూ!" అంటే తనకెంత హాయిగా ఉంటుందో.

"రా మమ్మీ! త్వరగా!"

తొందరపెడుతున్న కూతురివైపు విసుగ్గా చూసింది. మరోసారి కనుబొమల్ని పెన్సిల్‌తో దిద్దుకుంది. లిప్‌స్టిక్ షేడ్ సరిచూసుకుని బయటపడింది.

భర్త త్రినాథ్ కారు డోర్ తీసిపట్టుకుంటే అపురూప అతి నాజూగ్గా కారులో కూర్చుంది.

పెళ్ళయిన కొత్తలో త్రినాథ్ - "ఇంతటి సౌందర్యరాశివి నాదానివయినావు. ఏ పూర్వజన్మ సుకృతమో ఇంతటి అందం నా స్వంతం కావటం! నీ కోసం ఏం చేయనూ? నీకు కృతజ్ఞతగా ఏమివ్వను?" అంటే, నవ్వి "నాకు ఇంటినిండా ఖరీదైన అద్దాలు పెట్టించండి, చాలు!" అంది గోముగా.

త్రినాథ్‌కి మొదట అర్థం కాలేదు. అర్థమయ్యాక ఆశ్చర్యం వేసింది.

"ఆర్యూ సీరియస్?" అన్నాడు అనుమానంగా.

"ఎస్! ఐ లవ్ మిర్రర్స్!" అంది అపురూప.

"నా అందాన్ని చూపించే అద్దం కూడా అందంగా ఉండొద్దూ! లేకపోతే ఆ అర్హత దానికెలా వస్తుందీ!" అంటూ గారాలు పోయిన భార్య కోరిక తీర్చటం కోసం ఇంటినిండా నిలువెత్తు అద్దాలు పెట్టించాడు. బాత్రూమ్‌లో, బెడ్రూమ్‌లో, హాల్లో. . . చివరికి కిచెన్‌లో కూడా.

అందుకే వాళ్ళింటికి 'హౌస్ ఆఫ్ మిర్రర్స్!' అని పేరు పెట్టారు చుట్టుపక్కల వాళ్ళు.

కారు కదిలి పదినిముషాలు కాకముందే తన వానిటీబ్యాగ్‌లోంచి చిన్న అద్దం తీసి చూసుకుంది రూప.

తను అందగత్తెననే ఊహ తెలిసినప్పటినుండీ తన అందమైన శరీరాన్ని ఎంతగా ప్రేమించిందో, ఆ అందాన్ని చూపించే అద్దాల్ని కూడా అంతగానే ప్రేమించింది అపురూప. అద్దాలన్నిట్లోకీ తనకు అపురూపమైందీ, అతి ప్రియమైనదీ ఈ వానిటీ బ్యాగ్‌లోని చిన్న అద్దం.

పెళ్ళయిన తర్వాత వచ్చిన తన మొదటి పుట్టినరోజు నాడు త్రినాథ్ ఇచ్చిన బహుమతి ఆ అద్దం. ఎంత ఖరీదైనా వెనుకాడకుండా ప్యారిస్‌నుంచి తెప్పించాడా అద్దాన్ని - ఏనుగుదంతంతో చేసిన అందమైన ఫ్రేమ్, అద్భుతమైన పనితనంతో చెక్కిన నగిషీలు. . . . మధ్యలో ఒవల్ షేప్‌లో అద్దం.

ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో కూచున్న అరగంటలో పదిసార్లయినా ఆ అద్దంలోతన అందాన్ని చూసుకుని ఉంటుంది అపురూప.

పెళ్ళయిన కొత్తలో త్రినాథ్‌కి అపురూప అందం మత్తుమత్తుగా ఉండేది. ఆ అందాన్ని కాపాడుకోడానికి ఆమె పడే తాపత్రయం చూసి, 'నా కోసమేగా, నా ఆనందం కోసమే!' అని తనూ సహకరించేవాడు.

అందం పాడవుతుందని తనకు పిల్లలే వద్దన్న అపురూప - త్రినాథ్ కాళ్ళావేళ్ళా పడి బతిమాలితే, "ఒకే ఒక ఛాన్స్ ఇస్తున్నా!" అంది వరమిచ్చే దేవతలా.

వినీల పుట్టాక పాలివ్వటానికి నిరాకరించింది. అనవరతం తన సౌందర్యాన్ని ఇనుమడింప చేసుకోవాలనే తాపత్రయంలో మునిగి ఉండే అపురూప, వినీల ఆలనా పాలనా పట్టించుకునేది కాదు. వినీలను చూసుకోడానికి ఓ ఆయాను ఏర్పాటు చేశాడు త్రినాథ్. తల్లీ దండ్రీ తనే అయి ఆమెను పెంచాడు. అందుకే వినీలకు తండ్రంటేనే ప్రేమా, గౌరవం. 'మీ చెల్లెలా' అని అడిగే వాళ్లకోసం తనను తోడుగా పిలుచుకెళ్ళి తన అహాన్ని తృప్తిపరుచుకుని, తన స్వాతిశయాన్ని చాటుకునే అమ్మంటే ఆమెకు అసహ్యం.

గత కొన్నేళ్ళుగా త్రినాథ్‌ని కూడా దగ్గరకు రానివ్వటం లేదు అపురూప. దానికీ

రేషనింగ్ పెట్టింది. "ఎంత జాగ్రత్తగాకాపాడుకుంటే ఇలా ఉన్నాననుకున్నారూ!" అంటూ ముక్తాయింపు.

కూతురికి పదహారేళ్ళు వచ్చినా కన్నెపిల్లలా, కొత్తగా పరువపు వెల్లువ తాకిన ఏటి ఒడ్డులా ఆమె తుళ్ళిపడుతుంటే, ఆమె అందాన్ని కాపాడుకుంటున్నది తన కోసం కాదని, ఆమె కోసమేనని అర్థమై త్రినాథ్‌కి చిరాగ్గా ఉంటోంది.

విమానం బయలుదేరిన క్షణం నుంచీ ఇప్పటివరకూ ఓ ఇరవై సార్లయినా అద్దంలో తన మేకప్‌ని సరిచూసుకున్న అపురూపవైపు విసుగ్గా చూశాడు త్రినాథ్.

"రూపా! మనం వెళ్తున్నది మీ నాన్నగారి షష్టిపూర్తికి. మీ అమ్మకు ఆర్నెల్లుగా ఆరోగ్యం సరిగ్గా ఉండటం లేదని తెలిసి ఆమెను కూడా చూసి రావచ్చని వెళ్తున్నాం. వెళ్ళేది పేరంటానికి కాదు. నీ సింగారాలు షోకులు తగ్గించు!" అన్నాడు.

భర్త వైపు నిరసన చూపొకటి చూసి, అద్దం వానిటీ బాగ్‌లో పెట్టేసింది అపురూప. అద్దం జోలికి పోకుండా ఓ పదినిముషాలు బుద్ధిగా కూచుంది. ఆ పది నిముషాల్లో అపురూపను వాళ్ళమ్మ జ్ఞాపకాలు చుట్టుముట్టాయి.

అమ్మ. . . ఎంత అందమైన స్త్రీ. నాన్ననెలా ఇష్టపడి పెళ్ళిచేసుకుందో. . కాకి ముక్కుకి దొండపండులా. . అదే అడిగితే "నాన్న చాలా మంచి వారు. ఆ మంచితనం చూసీ... ." అంటూ బోల్డంత సిగ్గుపడిపోయే అమ్మ.

తనెంత అదృష్టవంతురాలో. . అమ్మపోలిక వచ్చింది కాబట్టి బతికిపోయింది. పొరపాటున నాన్న పోలికలు వచ్చి ఉంటేనా, అమ్మో. . భరించగలదా! ఆత్మహత్య చేసుకుని ఉండేది. సౌందర్య రాహిత్యాన్ని తను తట్టుకోలేదు.

అచ్చం అమ్మలానే ఉండే తనను స్కూల్లో ఎవరైనా "మీ అమ్మలా ఉంటావు!" అంటే ఎంత గర్వమో! ఇంత అందాన్ని తనకు వరంలా ఇచ్చిన అమ్మంటే అందుకే తనకు అమితమైన ఇష్టం.

అమ్మను చూసి ఎన్నేళ్ళయిందీ? ఇరవై ఏళ్ళకే తనకు పెళ్ళయింది. పెళ్ళయిన

వెంటనే తను త్రినాథ్‌తో కలిసి అమెరికా వచ్చేసింది. ప్రతిసారీ ఇండియా వెళ్ళాలనుకోవటం. .. ఏదో ఒక అవాంతరం వచ్చి ఆగిపోవటం జరిగి. . ఇరవై ఏళ్ళు జరిగిపోయాయి. . .

బొంబాయిలో ఫ్లయిట్ మారి హైదరాబాదు ఎయిర్‌పోర్ట్‌లో దిగాక అమ్మకోసం వళ్ళంతా కళ్ళుచేసుకుని వెదికింది అపురూప. అమ్మ కనిపించలేదు. నాన్నగారు రిసీవ్ చేసుకున్నారు.

కారు ఇంటిముందు ఆగగానే ఇంట్లోకి పరుగెత్తింది అపురూప. అమ్మ కనిపించలేదు.

"అమ్మేదీ? అమ్మేదీ?" అంటూ ఇల్లంతా పదిసార్లు తిరిగింది హాల్లో సోఫాలో కూచుని ఉన్న అరవై ఏళ్ళ ముసలావిణ్ణి పట్టించుకోకుండా.

"నాన్నా! అమ్మ ఎక్కడికి వెళ్ళింది?" అని అడిగినప్పుడు. . . ఆ ముసలావిడ నవ్వు. . .. అదే నవ్వు. . . అచ్చం అమ్మలా. . . అవును, అది అమ్మ నవ్వే! మరి అమ్మ! ఈవిడేనా అమ్మ?

ముగ్గుబుట్టలా తల. . . ముఖం నిండా ఆ ముడతలు, వడలిపోయిన శరీరం. . .

ఆనాటి అందమైన చారడేసి కళ్ళు, మిరుమిట్లు గొలిపే బల్బుల్లా కాకుండా, కాంతివిహీనమై, గుడ్డిదీపాల్లా. . మినుకు మినుకు మంటూ. . కళ్ళ కింద నల్లటి చారలు. . . మధువులూరుతున్నట్లు తడిగా తళతళలాడిన పెదాలు. . ఇపుడు ఎండిపోయి బీటలు వారిన నేలలా. . .

కొన్ని నిముషాల వరకూ తన కళ్ళను తను నమ్మలేకపోయింది.

చివరికెలాగో తేరుకుని "అమ్మా! నువ్వేనా?" అంది.

వాళ్ళమ్మ నవ్వుతూ "నాకు తెలుసు నువ్వు గుర్తుపట్టలేవని. అయినా చూద్దామని

హాల్లోనే కూచున్నా. నీవు పదిసార్లు నా ముందునుంచి ఇటూ అటూ తిరిగావు తప్ప, నన్ను గుర్తుపట్టలేదు. ఇరవై ఏళ్ళు అయింది కదూ నన్నుచూసి. . ." అంది.

అపురూపకు వాళ్ళమ్మ జడంటే ఈర్ష్యగా ఉండేది. జెర్రిపోతులా బారెడు పొడవుండి, దట్టంగా ఉండే జడస్థానంలో మిగిలిన పిలకల్లాంటి పది వెంట్రుకలని చూస్తూ "అది కాదమ్మా! నీలో ఇంత మార్పా!" అంది అపురూప ఆశ్చర్యం నుంచి తేరుకోలేక.

"మరి మార్పు సహజం కదమ్మా! నాకు దాదాపు అరవై ఏళ్ళు. దానికితోడు కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగుండటం లేదాయె!" అందివాళ్ళమ్మ.

తన ఎదురుగా ఉన్న సౌందర్యహీనమైన ఈ శరీరం తన తల్లిదేనన్న నిజాన్ని అపురూప జీర్ణించు కోలేకపోతోంది. ఏడురంగుల ఇంద్రధనుస్సులా సమ్మోహితపరచే ఆమె నవ్వు ఆ క్షణం నించే అదృశ్యమైంది. ఆమెకు అన్నం సయించటం లేదు. నిద్రపట్టడం లేదు.

ఆమె కిష్టమని వాళ్ళమ్మ తెప్పించి గదుల్లో అమర్చిన అద్దాలు దయ్యాల్లా భయపెడుతున్నాయి. అద్దంలో ప్రతిబింబం చూసుకుంటే తన ముఖం స్థానంలో ముడతలు పడిన అమ్మ ముఖం కనిపిస్తోంది. అందమైన కళ్ళకు బదులు జీవం లేని గాజు గోళీల్లా మారిన అమ్మ కళ్ళు కనిపించి ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

అపురూపకిప్పుడు అద్దాలంటే అసహ్యం వేస్తోంది.

తనింత అపురూపంగా కాపాడుకుంటూ వచ్చిన అందాన్ని చివరికిలా ముసలితనం మింగేస్తుందా? తనూ అమ్మలా సౌందర్యహీనురాలవుతుందా? కోటి సూర్యుల్లా వెలిగే తన కళ్ళూ ఎండిన కాసారాలవుతాయా? లేత గులాబీరేకుల్లాంటి తన పెదవులు పోకచెక్కల్లా మారిపోతాయా? తను భరించలేదు. . . . అలా జరిగితే తను తట్టుకోలేదు. అపురూపలో అనంతమైన దిగులు . . .

ప్రతి చిన్న విషయానికీ వినీలను విసుక్కుంటోంది. ఒకరోజు అందరిముందూ

వినీలను తిట్టి, చేయి చేసుకుంది. కూతురి కళ్ళలో కన్నీళ్ళు చూసిన త్రినాథ్ తట్టుకోలేకపోయాడు. "తల్లిగా దాని బాగోగులు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం సాటి మనిషిగా మానవత్వంతోనైనా ప్రవర్తించలేవా?" అన్నాడు కోపంగా. మాటా మాటా పెరిగి, అపురూప వాళ్ళ అమ్మానాన్నల జోక్యంతో సద్దు మణిగింది.

వాళ్ళు తిరిగి అమెరికా వెళ్ళబోయే రోజు అపురూపను పిలిచి దగ్గరగా కూచోబెట్టుకుంది వాళ్ళమ్మ.

అమ్మ మొహం చూడటానికే భయమేసి పక్కకు తిరిగి కూచుంది అపురూప.

"నీవొచ్చిన క్షణం నుంచీ నిన్ను గమనిస్తూనే ఉన్నాను. నీ మనసును తొలుస్తున్నదేమిటో నాకు అర్థమైంది. జరామరణాలు మనిషికి సహజం. వాటిని ఆపటం ఎవరితరమూ కాదు. యవ్వనంలో విరబూసిన సౌందర్యం శాశ్వతం అనుకోవటం మూర్ఖత్వమే. నీకు అద్దాలంటే ఎంత ఇష్టమో నాకు తెలుసు. కానీ అద్దాల్లో కనిపించేది నీ బాహ్య శరీరపు ప్రతిబింబం మాత్రమే.

మన ఆత్మా, మనసూ, శరీరం ఈ మూడింటి సమ్మిళిత ప్రతిబింబాలే మన పిల్లలు. నీవు నశ్వరమైన శరీర ప్రతిబింబంలో జరావస్థ వల్ల కలిగే మార్పులకు భయపడి అద్దం చూడటం మానుకున్నావు. మనం కోరినా, కాదన్నా ఆ మార్పు అనివార్యం. కానీ ఒకటి గమనించావా. . . . మన ప్రవర్తనా, మనస్తత్వం, సంస్కారం శాశ్వత ప్రతిబింబాలై మన సంతానంలో ప్రతిఫలిస్తాయి. అవి అందంగా ఉండేటట్టు జాగ్రత్త పడితేచాలు. ఎందుకంటే వీటివల్ల సంక్రమించే సౌందర్యానికి జరావస్థ లేదు కాబట్టి - ఈ సౌందర్యం వయసుతో పాటు నిగ్గు తేలుతుంది కాబట్టి.

నా అందం హరించుకుపోయిందన్న దిగులు నాకు లేదు. నువ్వున్నావు కాబట్టి. . . నువ్వు నా ప్రతిబింబం కాబట్టి!" వాళ్ళమ్మ చెప్పటం ముగించింది.

అపూరూప కార్లో ఎక్కే ముందు ఎవరో అన్నారు "వినీల చూశారా. . . అచ్చం వాళ్ళమ్మ పోలికే. . ఆమె ప్రతిబింబంలా . . .!"

అపురూప తన కూతురివైపు ప్రేమగా, గర్వంగా చూసుకుంది.

కారు కదిలింది. ఇప్పుడామె వానిటీబ్యాగ్‌లో ప్యారిస్ నుంచి త్రినాథ్ తెప్పించిన అందమైన అద్దం లేదు.

*• ఆంధ్రప్రభ, నవంబర్ 2, 1998 •*